# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నీట్ యూజీ, యూజీసీ నెట్ ప్రశ్నపత్రాల లీకేజీ వివాదాల నేపథ్యంలో ఈరోజు జరగాల్సిన నీట్ పీజీ ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది.**
2. **కొత్తగా కొలువు దీరనున్న లోక్‌సభ తొలి సమావేశాలు రేపు ప్రారంభం కానున్నాయి.**
3. **రాష్ట్రంలో గత ప్రభుత్వ ఆర్థిక విధానాలపై త్వరలో నివేదిక సమర్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.**
4. **పెంచిన పింఛను మొత్తం 7 వేల రూపాయలు జులై 1వ తేదీన పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు.**
5. **పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

==========================

నీట్ యూజీ, యూజీసీ నెట్ ప్రశ్నపత్రాల లీకేజీ వివాదాల నేపథ్యంలో ఈరోజు జరగాల్సిన నీట్ పీజీ ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. అదేవిధంగా జాతీయ పరీక్షల సంస్థ ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌కు ఉద్వాసన పలికింది. నీట్ యూజీ-యుజీసిఎన్ఈటి పరీక్షల అమలులో జరిగిన అవకతవకలపై సీబీఐ దర్యాప్తునకు కేంద్ర విద్యాశాఖ ఆదేశించింది. త్వరలో పరీక్ష తేదీని ప్రకటిస్తామని తెలిపింది.

--------------------------

ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో జాతీయ పరీక్ష సంస్థ ఎన్‌టీఏ సంస్కరణల కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇటీవల నిర్వహించిన నెట్, నీట్ ప్రశ్నపత్రాలు లీకైన నేపథ్యంలో ఎన్‌టీఏను సంస్కరించేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేస్తామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కమిటీ సభ్యులను నియమిస్తూ నిన్న కేంద్ర విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు నెలల్లో కమిటీ నివేదిక ఇవ్వనుందని పేర్కొంది.

--------------------------

నూతనంగా కొలువు దీరనున్న లోక్‌సభ తొలి సమావేశాలు రేపు ప్రారంభం కానున్నాయి. ప్రొటెం స్పీకర్‌గా ఉన్న భారతీయ జనతా పార్టీ ఎంపీ భర్తృహరి మహతాబ్ నేతృత్వంలో లోక్ సభ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలుత ప్రమాణస్వీకారం చేయనున్నారు. అనంతరం

ప్రధాన ప్రతిపక్షనేత, ఆ తర్వాత మంత్రులు, లోక్ సభ సభ్యులు అక్షర క్రమంలో ప్రమాణ స్వీకారం చేస్తారు.

---------------------------

రాష్ట్రంలో గత ప్రభుత్వ ఆర్థిక విధానాలపై త్వరలో నివేదిక సమర్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఇప్పటివరకు ఆర్థిక శాఖలో పనిచేసిన ముగ్గురు కార్యదర్శులు వెళ్లిపోయారని, వారి స్థానంలో కొత్తవారు బాధ్యతలు తీసుకున్న తర్వాత వివరాలన్నీ క్రోడీకరించి ప్రజలకు చెబుతామని పేర్కొన్నారు. దిల్లీలో నిన్న జరిగిన జీఎస్టీ కౌన్సిల్, కేంద్ర బడ్జెట్ సన్నద్ధత సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన ఏపీ భవన్‌లో రాత్రి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి సాయం, అమరావతి ప్రాంత అభివృద్ధి, పోలవరం, వెనుకబడిన జిల్లాలకు నిధులు, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి పలు అంశాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక నోట్ సమర్పించినట్లు పేర్కొన్నారు.

---------------------------

పెంచిన పింఛను 4 వేల రూపాయలతోపాటు మొత్తం 7 వేల రూపాయలు జులై 1వ తేదీన పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. పంపిణీలో లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన పింఛను పాసుపుస్తకాలనూ నగదుతో పాటు అందించాలని తెలిపారు. సచివాలయంలో నిన్న జరిగిన సమీక్షా సమావేశంలో డ్వాక్రా మహిళలకు జీవనోపాధి కల్పనపై దృష్టి పెట్టాలని, బ్యాంకు లింకేజీ రుణాలు ప్రతి సంఘానికి సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి జిల్లాకు 10 మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయడంతోపాటూ ఉన్నతి పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి మరింత తోడ్పడే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

---------------------------

రేపటి నుంచి లోక్ సభ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకులుగా నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు నియమితులయ్యారు. నిన్న మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పార్లమెంటరీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ పార్లమెంటరీ నేతగా లావు శ్రీకృష్ణదేవరాయలును ఎంపిక చేశారు. అలాగే డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా బైరెడ్డి శబరి, దగ్గుమళ్ల ప్రసాద్ రావు, కోశాధికారిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను ముఖ్యమంత్రి నియమించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాబినెట్ సమావేశాన్ని రేపు నిర్వహిస్తున్నట్లు అన్ని శాఖల ఉన్నతాధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో రేపు ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పథకం అమలును ఈ కమిటీ సమీక్షించి వివిధ శాఖలను మధ్య సమన్వయం

చేస్తుంది. ప్రభుత్వ కార్యాలయాలపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసేందుకు, నిర్దేశిత వ్యవధిలో లక్ష్యం చేరుకునేలా నిరంతరం సమీక్షిస్తుంది. వివిధ ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా ఉన్న వారికి రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్ల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తుంది. జిల్లా స్థాయిలో పథకం అమలు పర్యవేక్షణకు కలెక్టర్ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి స్టేట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీగా నెడ్‌క్యాప్ వ్యవహరించనుంది.

---------------------------

నిడదవోలు–కడియం మధ్య ఆధునికీకరణ పనుల కారణంగా ఈనెల 23వ తేదీ నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేరు డివిజన్ అధికారి నిన్న ఓ ప్రకటనలో తెలిపారు. వీటిలో కీలకమైన రత్నాచల్, జన్మభూమి, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి.

---------------------------

ప్రముఖ తెలుగు పండితులు, పరిశోధకులు, ఉపన్యాసకులు దివాకర్ల వెంకటావధాని జయంతి ఈ రోజు. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామంలో జన్మించిన ఆయన.. సంస్కృత, తెలుగు, ఆంగ్ల భాషలలో ప్రావీణ్యం సంపాదించారు. ప్రముఖ కవి విశ్వనాథ సత్యనారాయణ శిష్యునిగా ఉన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ.ఆనర్స్ పట్టా పొందారు. విశాఖపట్టణం ఎవి.వి.ఎన్. కళాశాలలో తెలుగు పండితునిగా, ఉపన్యాసకునిగా పని చేశారు. హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంధ్రోపన్యాసకునిగా, రీడర్ గా, ప్రొఫెసర్గా పలు కీలక బాధ్యతలను సమర్థంగా నిర్వహించారు. ఆయన పాండిత్య ప్రతిభకు గుర్తింపుగా కళాప్రపూర్ణ, కవిభూషణ వంటి బిరుదులు ఆయనను వరించాయి.

---------------------------

ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడుస్తుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... చీరాల అత్యాచార ఘటనలో 36 గంటల్లోనే నిందితులను పట్టుకున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామని మంత్రి అనిత తెలిపారు.

---------------------------

రాజధాని ప్రాంత రైతులు విజయవాడ ఇంద్రకీలాద్రికి ఈరోజు పాదయాత్ర నిర్వహించారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో పాటు రాజధాని ఉద్యమం విజయం సాధించడంతో అమరావతి ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ ఆలయానికి పాదయాత్ర ప్రారంభించారు. ఈరోజు తెల్లవారుజామున తుళ్లూరు శిబిరం వద్ద రైతులు, మహిళలు పొంగళ్లు తయారు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఇంద్రకీలాద్రికి కాలి నడకన బయల్దేరారు. ఉదయం 11 గంటలకు అక్కడికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తుళ్లూరు నుంచి రాయపూడి, రాజధాని సీడ్ యాక్సెస్ రహదారి, కరకట్ట, ప్రకాశం బ్యారేజీ మీదుగా పాదయాత్ర సాగింది.

---------------------------

టెండర్ల ప్రక్రియ ముగించి, నెల రోజుల్లో అమరావతిలో ఇంకా మిగిలి ఉన్న కంప తొలగింపు పనులు

పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. సమీకరణలో భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చే రైతుల నుంచి వాటిని తీసుకునే అంశంపై త్వరలో నిర్ణయం ఉంటుందని చెప్పారు. రాజధాని గ్రామాల రైతులు నిన్న విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్‌తో సమావేశమయ్యారు. తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

---------------------------

ముందస్తుగా తనిఖీలు పూర్తిచేసుకున్న భారత పౌరులకు, విదేశాల్లోని భారత పౌరులకు ఓసీఐ భారత్‌లో ప్రవేశాన్ని వేగవంతం చేసే కార్యక్రమాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న ప్రారంభించారు. ఫాస్ట్ ట్రాక్ వలసలు-విశ్వసనీయ ప్రయాణికుల కార్యక్రమం ఎఫ్‌టీఐ-టీటీపీ గా దీనిని వ్యవహరిస్తున్నారు. ఇతర దేశాల నుంచి వచ్చే భారత జాతీయులు, ఓసీఐ కార్డు గల ప్రయాణికులు విమానాశ్రయాల్లో దిగగానే ఇమిగ్రేషన్ తనిఖీలను త్వరగా పూర్తిచేసుకునేందుకు తోడ్పడుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ 2047 ఎజెండాలో ఎఫ్.టి.ఐ-టీటీపీ ముఖ్యమైన అంతర్భాగమని అమిత్ షా పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గౌవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

=======================